సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 2 । మే । 2023



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 373 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.7

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.4 మేర పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.9°/21.6°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నూతన డీఎస్పీల బాధ్యతల స్వీకరణ



శ్రీలత కదిరి డీఎస్పీ | వాసుదేవన్ పుట్టపర్తి డీఎస్పీ | కంజాక్షన్ హిందూపురం డీఎస్పీ

కొత్తచెరువు: ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన ముగ్గురు డీఎస్పీలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో పుట్టపర్తి, కదిరి డీఎస్పీలు యశ్వంత్, భవ్యకిశోర్ బదిలీ కాగా, కొత్తగా ఏర్పడిన హిందూపురం డివిజన్‌కు ఇంతవరకూ ఇన్‌చార్జ్ డీఎస్పీ కొనసాగుతున్నారు. దీంతో ప్రభుత్వం ఆయా డివిజన్‌లకు డీఎస్పీలను నియమించింది. దీంతో పుట్టపర్తి డీఎస్పీగా వాసుదేవ్, కదిరి డీస్పీగా శ్రీలత, హిందూపురం డీఎస్పీగా కంజాక్షన్ సోమవారం ఉదయం తమ కార్యాలయాల్లో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామన్నారు. పుట్టపర్తిలో బాధ్యతలు స్వీకరించి డీఎస్పీ వాసుదేవన్ సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశమై శాంతిభద్రతలు, పలు విషయాలపై సిబ్బందితో చర్చించి పలు సూచనలు చేశారు.

27 మండలాల్లో వర్షం

- ఎన్‌పీ కుంటలో 82.6 మి.మీ వర్షపాతం



పుట్టపర్తి అర్బన్: అకాల వర్షాలు జిల్లాను వదలడం లేదు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకూ జిల్లాలోని 27 మండలాల పరిధిలో వర్షం కురిసింది. నంబులపూలకుంట మండలంలో అత్యధికంగా 82.6 మి.మీ వర్షపాతం నమోదైంది. తలుపుల 60.4, తాడిమర్రి 58.4, ముదిగుబ్బ 52.4, కదిరి 52, బత్తలపల్లి 50, గాండ్లపెంట 45.2, అమడగూరు 37.2, తనకల్లు 35.6, ఓడీసీ 32.4, నల్లచెరువు 30.2, రొళ్ల 26.4, ధర్మవరం, నల్లమాడలో 18.6, బుక్కపట్నం 16.4, సోమందేపల్లి 15.8, కొత్తచెరువు, లేపాక్షిలో 14.6, హిందూపురం, సీకేపల్లిలో 12.8, చిలమత్తూరు, కనగానపల్లిలో 11 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణలో ఆగ్నేయ, దక్షిణ దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ నమోదు కావచ్చని తెలిపారు.

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేడు రాక

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ (హౌసింగ్) అజయ్‌జైన్ మంగళవారం ఉదయం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాలపై ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు, డీఈలతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.

ఆనందమని 'పింఛన్'



కప్పలబండలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పుట్టపర్తి అర్బన్: మే డే సందర్భంగా బ్యాంకులు పనిచేయనప్పటికీ 1వ తేదీనే ఠంచనుగా 'వైఎస్సార్ పింఛన్ కానుక' అందడంతో లబ్ధిదారుల మోములో ఆనందం వికసించింది. సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మే నెలకు సంబంధించి జిల్లాలోని 32 మండలాల పరిధిలో ఉన్న 2,63,587 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.73,18,35,000 మంజూరు చేసింది. వలంటీర్లు తెల్లవారుజామునుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఫలితంగా తొలిరోజు సోమవారమే జిల్లాలో 83 శాతం పంపిణీ పూర్తయ్యింది. వలంటీర్లు 2,17,384 మంది లబ్ధిదారులకు రూ.60,33,88,250 పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పింఛన్ పంపిణీకి మరో నాలుగు రోజులు గడువు ఉన్నందున వందశాతం పంపిణీ చేస్తామని తెలిపారు.

బాగు బడి

వైఎస్ జగన్ సర్కార్ విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. బోధనలో వినూత్న పద్ధతులతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తోంది. 'నాడు – నేడు' ద్వారా స్కూళ్లలో ఫర్నీచర్, శుద్ధనీరు, విద్యుత్ సౌకర్యం, ప్రహరీ, మరుగుదొడ్లతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే పలు స్కూళ్లలో పనులు పూర్తికాగా, స్కూళ్లన్నీ విద్యా..ఆలయాలుగా కనిపిస్తున్నాయి. ఇక పెండింగ్‌లో ఉన్న వివిధ స్కూళ్లలోని పనులను వేసవి సెలవుల్లో పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

- 'నాడు–నేడు'తో బడులకు సరికొత్తరూపు
- పాఠశాలల్లో మెరుగ్గా మౌలిక వసతుల కల్పన
- అందుబాటులోకి బాలికల మరుగుదొడ్లు
- అన్ని స్కూళ్లలో నిరంతర విద్యుత్.. శుద్ధినీరు
- వేసవి సెలవుల్లో ముమ్మరంగా పెండింగ్ పనులు



కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తున్న కదిరి వీవర్స్ కాలనీలోని పాఠశాల సముదాయం

సాక్షి, పుట్టపర్తి: సర్కారు బడులంటే గతంలో కనీస సౌకర్యాలు ఉండేవి కాదు. తాగునీరు, మరుగుదొడ్లు కూడా అందుబాటులో ఉండేవి కావు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు కూడా లేకపోవడంతో చెట్ల కింద కూర్చుని చదువుకునేవారు. ఆడుకునేందుకు మైదానం లేక.. పాఠశాలలకు ప్రహరీ లేక నానా అవస్థలు పడేవారు. ఈ పరిస్థితులను గమనించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 నవంబరు 14న 'నాడు–నేడు' పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ స్కూళ్లకు సరసన నిలబెడుతున్నారు. ఫలితంగా గతఏడాదే డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గింది. రానున్న విద్యాసంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవుల్లోనే 'నాడు–నేడు' పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

నాణ్యతకు పెద్దపీట..

'మన బడి నాడు– నేడు' పనుల్లో ప్రభుత్వం నాణ్యతకు పెద్దపీట వేసింది. ఏ చిన్న పొరపాటు జరగకుండా పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే రెండు విడతల నాడు– నేడు పనులకు ఏకంగా రూ.481 కోట్లు ఖర్చు చేసింది. అలాగే నిధుల విడుదల నుంచి పనుల పురోగతి, నిధుల వినియోగం, పనుల్లో నాణ్యత వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఫొటో క్యాప్చరింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఆయా పాఠశాలల్లో పనులు చేపట్టిన పనులను క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ సిబ్బంది ప్రతి వారం తప్పనిసరిగా పనుల పురోగతిని తెలియజేసేలా ఫొటోలు తీసి 'మనబడి నాడు–నేడు' యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

2,044	జిల్లాలోని పాఠశాలలు
2,038	విద్యుత్ సౌకర్యం కల్పన పూర్తయిన బడులు
2,043	తాగునీరు ఏర్పాటు చేసిన స్కూళ్లు
1,956	బాలికల మరుగుదొడ్లున్న పాఠశాలలు

విద్యా రంగానికి సర్కార్ ప్రాధాన్యం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. పేద విద్యార్థులూ ఉన్నత విద్య అభ్యసించాలన్న లక్ష్యంతో వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. విద్యాకానుక, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన, అమ్మ ఒడి, ట్యాబ్‌ల పంపిణీ, ఇంటర్నెట్ సౌకర్యం, తరగతి గదుల డిజిటలైజేషన్, జగనన్న గోరుముద్ద పథకాలు అమలు చేస్తున్నారు. అలాగే ఎంఈఓలకు స్కూళ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జవాబుదారీ తనం పెంచేందుకు తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేశారు. ఇక పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ (14417) నంబరు ఏర్పాటు చేశారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన కొళాయిలు

పారదర్శకంగా పనులు



'నాడు – నేడు' పథకం కింద పాఠశాలల ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్వహణ, తరగతి గదుల మరమ్మతులు, పెయింటింగ్స్ తదితర పనులు ప్రాధాన్యత ఆధారంగా చేపడుతున్నాం. ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాం. పెండింగ్ పనులపై దృష్టి సారించి రానున్న విద్యాసంవత్సరానికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం.
– పి.అరుణ్‌బాబు, కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన విద్య



రాష్ట్రంలో పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే 'నాడు – నేడు' పథకం తీసుకొచ్చారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. అక్కడక్కడా మిగిలిపోయిన పనులను ఈ వేసవి సెలవుల్లో పూర్తి చేయిస్తాం.
– యు.మీనాక్షి, జిల్లా విద్యా శాఖాధికారి

ప్రహరీ ఏర్పాటు



మా పాఠశాలలో ప్రహరీ లేకుండేది. నాడు–నేడు పథకంలో భాగంగా ప్రహరీ నిర్మించారు. ఆట మైదానం బాగుంది. మరుగుదొడ్ల సమస్య లేదు. తరగతి గదిలోనే పాఠాలు చెబుతున్నారు. గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరిగింది.
– నయాజ్‌బాషా, 10వ తరగతి, జెడ్పీ హైస్కూల్, పెదపల్లి



సీకేపల్లి మండలం హరియాన్ చెరువు సూల్లో ఫర్నీచర్

నాడు- నేడు కార్యక్రమంలో చేపట్టే పనులు ఇవే..

'మన బడి నాడు–నేడు' కార్యక్రమంలో భాగంగా రక్షిత తాగునీటి కోసం నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు, బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, కరెంటు సౌకర్యం, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటు, తరగతి గదుల్లో ఫర్నీచర్, గ్రీన్ బోర్డుల ఏర్పాటు, పాఠశాల భవనాలకు పెయింటింగ్, అదనపు తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం.. తదితర పనులు చేపట్టారు. ఈ పనులను పంచాయతీరాజ్, పురపాలక, సాంఘిక సంక్షేమ, జువైనల్ వెల్ఫేర్, ఫిషరీస్ శాఖల ఆధ్వర్యంలో మూడేళ్లలో దశల వారీగా పూర్తి చేయాల్సి ఉంది.



నిర్మాణం పూర్తయిన పాఠశాల ప్రహరీ

పార్టీకి నష్టం చేస్తే సహించం

- ఎమ్మెల్యే శంకర నారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంక నారాయణ

సోమందేపల్లి: ఎంతో క్రమశిక్షణ ఉన్న వైఎస్సార్ సీపీని అభాసుపాలు చేయాలని చూస్తే సహించబోమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హెచ్చరించారు. సోమవారం రేణుకానగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు గుడ్డం నాగేపల్లికి వెళుతున్న తనపై జరిగిన దాడిని ఖండించారు. స్వప్రయోజనాలకు సహకరించలేదన్న అక్కసుతో ఈదుల బళాపురానికి చెందిన నాగభూషణరెడ్డి తనపై, తన కుటుంబసభ్యులపై, పార్టీ కార్యక్రమాలపై రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టడం సహించరానిదన్నారు. దాడితో స్థానిక ప్రజలకు సంబంధం లేదని, గోరంట్ల, హిందూపురం ప్రాంతాల నుంచి తన అనుచరులను పిలిపించుకుని కాన్వాయ్‌ను అడ్డుకున్నారని పేర్కొన్నారు. పార్టీకి నష్టం చేకూర్చాలనుకునేవారు ఎంతటి వారైనా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాగభూషణరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సోమందేపల్లి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఎస్సీ సెల్ నాయకులు గజేంద్ర, ఈశ్వర్, కంబాలప్ప, సర్పంచ్‌లు రామాంజనేయులు, జిలాన్‌ఖాన్, సోము, కిష్టప్ప పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'లో 50 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 50 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రామకృష్ణప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- ప్రతి అధికారీ 'గ్రీవెన్స్'కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- స్పందనలో అందే అర్జీల్లో రెవెన్యూవే అధికం
- 'స్పందన'లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్ : ''స్పందనలో రెవెన్యూకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా వస్తున్నాయి. ఆ తర్వాత హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన సమస్యలపై అర్జీలు అందుతున్నాయి. కేవలం 8 శాఖలకు సంబంధించిన అర్జీలే 90 శాతం ఉన్నాయి. ఆయా శాఖల అధికారులు ఓ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ప్రత్యేకంగా కేటాయించి 'గ్రీవెన్స్' పరిష్కరించాలి. అధికారులు సమన్వయంతో పనిచేసి మండల స్థాయిలో సమస్యలు పరిష్కరించాలి'' అని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 109 అర్జీలు అందగా అధికారులు అప్పటికప్పుడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, 'స్పందన' అనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమన్నారు. ప్రతి అధికారి సరైన సమయంలో హాజరు కావాలన్నారు. రెండు జిల్లాలకు పని చేస్తున్న అధికారులు ఒక వారం అనంతపురంలో, మరోవారం శ్రీసత్యసాయి జిల్లాలో జరిగే స్పందనకు హాజరు కావాలన్నారు.

నెలాఖరులోపు నిర్మాణాలు పూర్తి కావాలి..

ఇప్పటికీ గ్రౌండింగ్ కాని సచివాలయ, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్ఎల్ స్థాయిలో ఉన్న భవనాలను ఈనెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన వారికి అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. డ్వామా పరిధిలో చేపట్టిన వివిధ పనులకు సంబంధించి రూ.7 కోట్ల బిల్లులను తక్షణమే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాకు సీనియర్ ఐఏఎస్..

'స్పందన'తో పాటు 9వ తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి చక్రధర్ బాబును ప్రభుత్వం నియమించిందని కలెక్టర్ వెల్లడించారు. ఈనెల 3వ తేదీన ఆయన జిల్లాకు రానున్నారని, 'స్పందన'పై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ మేరకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారని, దీన్ని గుర్తించి అధికారులు పనిచేయాలన్నారు. మే 9 వ తేదీ తర్వాత స్పందన గ్రీవెన్స్‌లను నాణ్యతగా ఎలా పరిష్కరించాలి, అర్జీలను ఎలా తీసుకోవాలి, గడువులోపు ఎలా పరిష్కరించాలి తదితర అంశాలను సీఎం కార్యాలయం నుంచి మానిటర్ చేస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీహెచ్ఓ చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి ఉన్నారు.



దివ్యాంగుల కోసం కిందకు వచ్చి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ కొండయ్య

సేవలకు సత్కారం

వలంటీర్లు ప్రజాసేవకులు, సంక్షేమ వారధులు... సామాజిక పింఛన్ పంపిణీ మొదలు, ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారులకు చేర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటారు. అభివృద్ధి కార్యక్రమాల్లోనూ భాగస్వాములవుతారు. ఇంటింటికీ తిరుగుతూ.. ఇంట్లో ఒకరిగా పనులు చేసి పెడతారు. అలాంటి వలంటీర్ల సేవలకు సర్కార్ సలాం చేస్తోంది. సన్మానంతో గౌరవిస్తోంది.

- వరుసగా నాలుగో ఏడాది వలంటీర్లకు సన్మానం
- మండల కేంద్రాలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్
- జిల్లాలో 8,490 మందిని ఎంపిక చేసిన అధికారులు



8,490	జిల్లాలోని వలంటీర్ల సంఖ్య
34	సేవా వజ్రకు ఎంపికైన వారు
193	సేవా రత్నకు ఎంపికైన వారు
8,263	సేవా మిత్రగా ఎంపికైన వారు

పుట్టపర్తి అర్బన్: సచివాలయ వ్యవస్థలో కీలకంగా మారిన వలంటీర్ల సేవలకు సర్కార్ గుర్తింపు ఇస్తోంది. సేవలకు మెచ్చి ఏటా సన్మానం చేస్తోంది. ఇప్పటికే వరుసగా మూడేళ్లు వలంటీర్లకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించిన ప్రభుత్వం..తాజాగా నాలుగో ఏడాది ఉత్తమ సేవలకు పురస్కారాలు అందజేసేందుకు సిద్ధమైంది. పనితీరు ఆధారంగా మూడు కేటగిరీల్లో అవార్డులు అందజేయనుండగా, జిల్లా అధికారులు ఇప్పటికే జాబితా సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రశంసాపత్రాలు, బ్యాడ్జీలు, మెడల్స్‌ను మండల కేంద్రాలకు పంపారు. ఈ నెలలోనే సన్మాన కార్యక్రమం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సేవా వజ్రలకు రూ.30 వేల నగదు బహుమతి..

జిల్లాలో 32 మండలాలు, 6 మున్సిపాలిటీల పరిధిలోని 8,490 మంది గ్రామ/వార్డు వలంటీర్లు పని చేస్తున్నారు. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజాము నుంచి పింఛన్ లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక అందజేయడంతో వలంటీర్‌కు నెల ప్రారంభమవుతుంది. పింఛన్ పంపిణీకి 5 రోజుల గడువు ఉన్నప్పటికీ, కొంతమంది వలంటీర్లు రెండు రోజులకే వంద శాతం పంపిణీ పూర్తి చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం ఇచ్చే పలు సర్వేలు చేయడం, ఆధార్ అప్‌డేట్ చేయించడం, ఓటరు సర్వే, ఫీవర్ సర్వేలో పాలుపంచుకుంటున్నారు. అలాగే సచివాలయాల ద్వారా అందించే 500కుపైగా సర్వీసులను ప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా ఠంచన్‌గా రూ.5 వేల గౌరవ వేతనం రూ. రూ.200 పేపర్ అలవెన్సు అందజేస్తోంది. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సన్మానించేందుకు సిద్ధమైన ప్రభుత్వం సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్రగా మూడు కేటగిరీలుగా విభజించింది. ఈమేరకు అధికారులు 34 మందిని సేవావజ్రకు, 193 మందిని సేవారత్నకు, 8,263 మందిని సేవా మిత్ర అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి ప్రశంసాపత్రంతో పాటు పతకాలు అందజేయనున్నారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతిని అందజేయనున్నారు.

5లోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలి

పుట్టపర్తి అర్బన్: ఏపీ ట్రెజరీ శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లాలోని ఉద్యోగులు, పెన్షనర్లు ఈనెల 5వ తేదీ లోపు ఈ–కేవైసీ పూర్తి చేయాలని జిల్లా ట్రెజరీ అధికారి నాగమల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https: herb. apcfss. in వెబ్‌సైట్‌లో ఈ–కేవైసీ పూర్తి చేయకపోతే జీతభత్యాలు, పింఛన్లకు ఇబ్బందులు తలెత్తుయన్నారు. అందువల్ల ప్రతి ఉద్యోగీ తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

దత్తతకు ఇద్దరు చిన్నారులు

అనంతపురం సెంట్రల్: మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు చిన్నారులను దత్తతకు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దైవిక్ (54 రోజులు), శ్రీరామ్ (రెండు సంవత్సరాలు)కు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే 30 రోజుల్లోపు సంప్రదించాలి. లేకపోతే వారిని ప్రభుత్వ నిబంధనల మేరకు వేరొకరికి దత్తతకు ఇవ్వనున్నారు.

రెండిళ్లలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పరిగి: వేర్వేరు గ్రామాల్లో ఒకే రోజు రెండిళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న ముక్కర్ల కృష్ణారెడ్డి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఉక్కపోతను భరించలేక ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి మిద్దెపైకి చేరుకుని నిద్రపోయారు. అర్ధరాత్రి రెండున్నర గంటలకు వర్షం మొదలవడంతో కిందకు దిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు బద్ధలుగొట్టబడి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలను ధ్వంసం చేసి 10 గ్రాముల బంగారు ఉంగరంతో పాటూ రూ.16,500 నగదు, హాల్‌లో ఉన్న ఓ సెల్‌ఫోన్‌ను దుండగులు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు.అలాగే మోగా గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు అంజినప్ప ఇంట్లో ఆదివారం రాత్రి దుండగులు చొరబడి, బీరువాలోని 7 తులాల బంగారంతో పాటు రూ.20 వేలను అపహరించుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుడ్లురిమి.. ఆగడాలు'జేసీ'

- నానాటికీ పెరుగుతున్న జేసీ ప్రభాకరరెడ్డి దౌర్జన్యాలు
- మున్సిపల్ అధికారులను గుప్పిట్లో పెట్టుకునే కుటిలయత్నం
- పని చేయలేక దీర్ఘకాలిక సెలవుపై కమిషనర్
- ఇలాగైతే పనిచేయలేమంటున్న మున్సిపల్ సిబ్బంది



తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం

తాడిపత్రి అర్బన్: స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించి పోతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రాభవం కోల్పోవడంతో ఏదో ఒక రూపంలో వివాదాలు సృష్టిస్తూ అందరి దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు తెరలేపారు. గుడ్లురుముతూ.. బ్లాక్‌మెయిల్ చేస్తూ అధికారులను గుప్పిట్లో పెట్టుకునే కుటిల యత్నాలు ముమ్మరం చేశారు. మున్సిపాలిటీలో వ్యవహారాలన్నీ తన కనుసన్నల్లోనే జరగాలని, అధికారులందరూ తాను చెప్పినట్లు నడుచుకోవాలని, లేకపోతే అంతు చూస్తానని మున్సిపల్ సిబ్బందిని ఇంటికి పిలిపించుకుని బెదిరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

బతుకంతా దౌర్జన్యాలు, దోపిడీలే

అధికారంలో ఉన్నా.. లేకున్నా.. జేసీ సోదరుల బతుకంతా దౌర్జన్యాలు, దోపిడీలేనని తాడిపత్రి వాసులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ తమ చీకటి రాజ్యాన్ని విస్తరించినట్లు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకూ వీరి ఆగడాలు భరించలేక ఎంతో మంది అధికారులు సెలవుపై వెళ్లగా... తాజాగా మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సైతం అదే దారిన పయనించారు. పట్టణాభివృద్ధికి సహకరించక పోవడంతో పాటు మున్సిపల్ పాలనా వ్యవహారాల్లో చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి జోక్యం చేసుకుని వేధింపులకు తెరలేపడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో సిబ్బంది మొత్తం మూకుమ్మడిగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

గెలుపుపై ఆశలు సన్నగిల్లి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన పట్ల ప్రజాదరణ పెరిగింది. ఈ క్రమంలో రాబోవు ఎన్నికల్లో ఆ పార్టీ అన్ని నియోజకవర్గాల్లోనూ విజయ కేతనం ఎగురవేస్తుందని జాతీయ స్థాయి సర్వే సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎక్కడేగాని అల్లర్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులకు, ఇతర అధికారులకు సంపూర్ణ స్వేచ్ఛను ఇస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతినిస్తూ వచ్చారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం వెన్నాడుతుండడంతో జేసీ ప్రభాకరరెడ్డి కుతంత్రాలకు తెరలేపారు. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రంలో అలజడులు సృష్టించి భయానక వాతావరణాన్ని నెలకొల్పేందుకు పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఆదరణను ఓర్వలేకపోతున్నారు



ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణను చూసి జేసీ ప్రభాకరరెడ్డి ఓర్వలేకపోతున్నాడు. వారి పాలనంతా దౌర్జన్యాలు, దోపిడీలతోనే సాగింది. చివరకు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు రావడం లేదు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని కుట్రలకు ఇప్పటి నుంచే తెరలేపాడు. అధికారులెవరూ భయపడొద్దు. రాజీ పడకుండా విధులు నిర్వర్తించండి. నేను అండగా ఉంటా. ప్రజల ఆశీర్వాదంతో జేసీ కుట్రలన్నీ తిప్పికొడతాం.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి

4 నుంచి బుద్ధ పౌర్ణమి వేడుకలు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయం వేదికగా ఈ నెల 4 నుంచి రెండ్రోజుల పాటు బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఏటా ప్రశాంతి నిలయంలో ఈ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం ఉదయం 8 గంటలకు సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. బౌద్ధ సన్యాసుల ప్రదర్శన అనంతరం పలువురు బౌద్ధ ప్రముఖులు ప్రసంగించనున్నారు. సాయంత్రం హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన బౌద్ధ సన్యాసుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 5న ఉదయం వివిధ దేశాలకు చెందిన బౌద్ధ సన్యాసుల ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ప్లాట్ ఫారం -1పై కూర్చొన్న చోటే ఉన్నఫళంగా కుప్పకూలి ప్రాణాల కోల్పోయాడు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

గొర్రెలపై పిడుగుపాటు



మృతి చెందిన గొర్రెలను చూపుతున్న రైతు

బొమ్మనహాళ్: పిడుగుపాటుకు గురై 20 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఏలంజి పంచాయతీ పరిధిలోని వడ్డే కొత్తూరు గ్రామానికి చెందిన రైతు లింగప్ప వ్యవసాయంతో పాటు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గొర్రెల పాకకు సమీపంలో పిడుగు పడింది. ఆ శబ్దానికి 16 గొర్రెలు, 4 మేకలు మృతిచెందాయి. దీంతో రూ. లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. కాగా, సమాచారం అందుకున్న బొమ్మనహాళ్ పశువైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి.. సోమవారం ఉదయం వడ్డేకొత్తూరుకు చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు పేర్కొన్నారు.

కియా ఉద్యోగి ఆత్మహత్య



మృతుడు వెంకటసాయి హర్ష

ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో కియా ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... విజయవాడకు చెందిన సుబ్బారావు కుమారుడు వెంకటసాయి హర్ష (22) కియా పరిశ్రమలో పనిచేస్తూ ధర్మవరంలో నివాసముంటున్నాడు. నెల రోజులుగా పట్టణంలోని శ్రీపాద లాడ్జ్‌లో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్న ఆయన... సోమవారం గది నుంచి ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో లాడ్జ్ నిర్వాహకులు వెళ్లి గమనించారు. అప్పటికే ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని మృతిచెందిన వెంకటసాయి హర్షను గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి బీరప్పస్వామి పట్టపు దేవర



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

బొమ్మనహాళ్: స్థానిక జగద్గురు రేవణ్ణ సిద్దేశ్వర మహా ప్రాంగణంలో వెలసిన కురుబల ఆరాధ్య దైవం ఆగలూరప్ప (బీరప్ప) స్వామి పట్టపు దేవర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండ్రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలను దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత రాజగిరి గోత్రం మల్లెల వంశస్తులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సోమవారం వారు విడుదల చేశారు. ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో ఆ మేరకు ఏర్పాట్లను నిర్వాహక కమిటీ సభ్యులు పూర్తి చేశారు. మంగళవారం కలశపూజ, కాగడసేవ, గణపతి పూజతో బీరప్ప దేవుళ్ల శోభా యాత్ర ఉంటుంది. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను కంబడిపై అధిష్టింప జేసి మహాశివపూజ నిర్వహించనున్నారు. బుధవారం పుణ్య దంపతులకు వస్త్ర సమర్పణ, సామూహిక వడిబాల కార్యక్రమాలు, గొరవయ్యల అమృతపానోత్సవం, బీరప్ప దేవుళ్ల సమేత ఆగలూరప్పస్వామి గ్రామోత్సవం, గొరవయ్యల నృత్యప్రదర్శన ఉంటాయి. ఉత్సవాలు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రాంతీయ కులగురువు గోవింద వాడ మృత్యుంజయ ఒడయార్, జాలోడు కరియణ్ణ ఒడయార్, బళ్లారి శరణయ్య ఒడయార్, కర్రసపర్తి శాంతమూర్తి ఒడయార్, చాబాల మల్లికార్జున ఒడయార్ హాజరు కానున్నట్లు కమిటీ సభ్యులు ఈశ్వరప్ప, నాగరాజు, తిమ్మప్ప, ఎర్రిస్వామి, ఆగలూరి పేర్కొన్నారు.

నామినేషన్ల కోలాహలం

- తొలి రోజు 30 నామినేషన్ల దాఖలు



నామినేషన్‌ను స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి కుమార్

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ సోమవారం కోలాహలంగా సాగింది. గతంలో కనీవిని ఎరుగని రీతిలో ఈసారి ఈ ఎన్నికలను సొసైటీ సభ్యులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తపాలా శాఖలోని మూడు యూనియన్లకు చెందిన వారు పోటీ పడుతుండడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

బోణీ అదిరింది

కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజే 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు 24 మంది నామినేషన్లు వేశారు. ఎక్స్‌ట్రా డిపార్ట్‌మెంట్ (జీడీఎస్ ఉద్యోగులు)కు సంబంధించి రెండు డైరెక్టర్ స్థానాలకు ఆరుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ తెలిపారు. రెండు ప్యానెళ్లకు సంబంధించి 11 మంది డైరెక్టర్లను సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంది. ఎన్నికైన డైరెక్టర్లు తిరిగి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శిని ఎన్నుకుంటారు.

తపాలా ఉద్యోగుల హంగామా

నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో తపాలా ఉద్యోగులు హంగామా చేశారు. తమ తమ మద్దతుదారులతో ర్యాలీగా వచ్చి నామినేషన్లు సమర్పించారు. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని కొందరు ఉద్యోగులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఐదేళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడం, ఈసారి మూడు యూనియన్లకు చెందిన వారు బరిలో దిగడం విశేషం. ఈ క్రమంలో ఎలాగైనా గెలుపొందాలన్న పట్టుదల మూడు యూనియన్ల నేతల్లోనూ స్పష్టమవుతోంది. ప్రత్యర్థులపై ఆరోపణలు, విమర్శలు చేస్తూ ఎన్నికల ప్రచారంలో ఎవరికి వారు ముందజలో నిలిచారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా 232 మంది

అనంతపురం క్రైం: కార్మిక దినోత్సవం సాక్షిగా సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు పంపింది. రాయలసీమ రీజియన్ పరిధిలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న 232 మందికి ప్రొబేషన్ డిక్లేర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి సోమవారం తెలిపారు. అనంతపురంలో 45 మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించగా.. ఇందులో 14 మంది వార్డు అడ్మినిస్ట్రేటివ్, ఏడుగురు ఎడ్యుకేషన్, 20 మంది శానిటరీ, నలుగురు వెల్ఫేర్ కార్యదర్శులు, కర్నూలులో 36 మందికి గాను 20 మంది అడ్మిన్, ఇద్దరు ఎడ్యుకేషన్, ఐదుగురు శానిటరీ, 9 మంది వెల్ఫేర్, కడపలో 56 మందికి గాను 9 మంది అడ్మిన్, 8 మంది ఎడ్యుకేషన్, 15 మంది శానిటేషన్, 24 మంది వెల్ఫేర్, చిత్తూరులో 95 మందికి గాను 26 మంది అడ్మిన్, 12 మంది ఎడ్యుకేషన్, 39 మంది శానిటరీ, 18 మంది వెల్ఫేర్ కార్యదర్శులు ఉన్నారు.

రగ్బీలో బంగారు పతకం



విజేత ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి అనంత జిల్లా బాలికల రగ్బీ జట్టు

హిందూపురం టౌన్: కర్నూలులోని ఆదర్శ విద్యాలయ వేదికగా ఏప్రిల్ 30 నుంచి రెండ్రోజుల పాటు జరిగిన జూనియర్ బాల, బాలికల రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా బాలికల జట్టు బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో ప్రకాశం జిల్లా జట్టుతో పోటీ పడిన ఉమ్మడి అనంత బాలికల జట్టు 5–0 పాయింట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఉమ్మడి జిల్లా బాలుర జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి పాలైంది. సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను అభినందిస్తూ ట్రోఫీతో పాటు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందజేశారు. ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, కార్యదర్శి యాసిన్ మాలిక్, డైరెక్టర్ ముస్తఫా కమల్‌బాషా, ట్రెజరర్ ముస్తకిమ్, జట్టు మేనేజర్ రూపవతి, కోచ్‌లు విష్ణు, లక్ష్మి, వేదవతి, సురేష్ అభినందించారు.

భక్తుల విరాళాలూ వదల్లేదు

- పెన్నహోబిలం అన్నదాన విరాళాల సేకరణలో గోల్‌మాల్
- దేవుడి పేరుతో దోచుకుంటున్నారంటున్న భక్తులు



అన్నదాన సత్రానికి డబ్బు చెల్లించినా రసీదు ఇవ్వలేదని ఆలయ ఈఓను నిలదీస్తున్న భక్తుడు (ఫైల్)

ఉరవకొండ: పెన్నహోబిలంలో భక్తుల విరాళాలనూ కొందరు పెద్దలు వదల్లేదు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన సత్రానికి అందిన విరాళాలను పక్కదారి పట్టించారు. ఈ విషయంగా కొందరు భక్తులు ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌ని నిలదీయడంతో అసలు గోల్‌మాల్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

రసీదులు చెల్లించకుండా మోసం

గత నెల 22న శ్రీవారి దర్శనానికి బళ్లారికి చెందిన కోర్టు ఉద్యోగి రాఘవేంద్ర కుటుంసభ్యులు వచ్చారు. ఆ సమయంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌ను కలసి అదే నెల 29న తమ కుటుంబసభ్యుల పేరుతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయాలని కోరుతూ రూ.15వేలు అందజేశారు. ఆ మొత్తాన్ని తీసుకున్న ఈఓ... కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేరని, రసీదు తర్వాత ఇస్తామని తెలపడంతో వారు వెళ్లిపోయారు. ఏప్రిల్ 29న రాఘవేంద్ర కుటుంబసభ్యులు మరోసారి ఆలయానికి వచ్చారు. దైవదర్శనం అనంతరం నేరుగా అన్నదాన సత్రానికి వెళ్లి.. ఈ రోజు అన్నదానం చేయిస్తున్నది తామేనని, ఎలాంటి వంటకాలు చేస్తున్నారని అక్కడి సిబ్బందితో ఆరా తీశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అశోకవర్ధన్ (అనంతపురం, ప్రైవేట్ ఉపాధ్యాయుడు) అడ్డుకుని అన్నదానం చేయిస్తున్నది తానేనని, ఇందుకు రూ.15 వేలు ముందుగానే చెల్లించానని తేల్చిచెప్పాడు. దీంతో ఇద్దరూ వెంటనే ఈఓను కలసి ఆరా తీశారు. ఆ రోజు వండిన భోజనం కనీసం పది మందికి కూడా సరిపోదని, దేవుడి పేరు చెప్పి దోచుకుంటారా? అంటూ నిలదీశారు. విరాళాన్ని ఇచ్చిన వెంటనే రసీదులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఊహించని ఘటనతో ఈఓ విజయ్‌కుమార్‌కు పాలుపోలేదు. అన్నదానానికి సంబంధించి ప్రత్యేకంగా విరాళాల పుస్తకం లేదని, రథం తయారీకి సంబంధించిన రసీదు ఇస్తామని తెలపడంతో అలాంటివి తమకు వద్దంటూ విషయాన్ని వెంటనే ఫోన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

విరాళాల పుస్తకాన్ని దాచి...

పెన్నహోబిలానికి ప్రతి శనివారమూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరికి అన్నదానం చేయడాన్ని దైవ కార్యంగా భావించిన ఎందరో దాతలు పెద్ద ఎత్తున విరాళాలను అందజేస్తున్నారు. అన్నదాన సత్రానికి సంబంధించి అందుబాటులో ఉన్న విరాళాల పుస్తకాన్ని దాచి రసీదులు ఇవ్వకుండా భక్తులను అధికారులు మోసం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాక వందలాది మంది భక్తులకు సరిపడేలా చేయాల్సిన వంటకాలను కేవలం పది మందికి మాత్రమే సరిపెడుతూ చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత ఎవరొచ్చినా.. భోజనం లేదని వెనక్కు పంపుతున్నారు. వంటకాలను సైతం నాసిరకంగా చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని భక్తులు విమర్శిస్తున్నారు.

ప్రత్యేకంగా రసీదులు ఇవ్వం

పెన్నహోబిలంలో అన్నదాన సత్రానికి భక్తులు ఇచ్చే విరాళాలకు సంబంధించి ప్రత్యేకంగా ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదు. ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదు. గత నెల 22న రాఘవేంద్ర, అశోక్‌వర్ధన్ చెరో రూ.15వేలు అన్నదానం కోసం ఇచ్చిన మాట వాస్తవమే. వచ్చిన భక్తులకు పూర్తి స్థాయిలో అన్నదానం చేస్తున్నాం.

– విజయ్‌కుమార్, ఈఓ, పెన్నహోబిలం

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ

అనంతపురం సిటీ: అనంతపురానికి చెందిన ఇద్దరు చిన్నారులు జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో రాణించారు. గత నెల మొహాలిలో జరిగిన రోలర్ స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో అనంతపురానికి చెందిన ఆర్. సాయి కార్తీక్‌రెడ్డి బంగారు పతకం సాధించాడు. అలాగే రింక్–1 రేస్‌లో వెండి పథకాన్ని హంజ దక్కించుకున్నాడు.